
PRABHATA GAMANAM
RNI NO.TELTEL/2022/83842
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్ | సంచిక 226 | సంపుటి 4 | మంగళవారం | 05-05-2026 | పేజీలు 4 | వెల 3/-

## పిడుగుపాటుకు పశువులు మృతి
- బాధిత రైతును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్
- తాళ్లపూసపల్లిలో రైతులకు అండగా నిలిచిన మాజీ శాసనసభ్యులు
- ధాన్యం కొనుగోలు సమస్యలపై అధికారులతో ఫోన్లో చర్చ

04





తమిళనాడు రాజకీయాల్లో ఊహించని విధంగా భారీ సంచలనం నమోదై, రాష్ట్ర రాజకీయ దిశనే మార్చే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వెండితెరపై 'దళపతి'గా అపార ప్రజాదరణ పొందిన విజయ్, ఇప్పుడు అదే క్రేజ్ ను ఓట్లుగా మార్చుకుని ప్రజా రాజకీయాల్లో అఖండ ప్రభంజనం సృష్టిస్తున్నారు. ఆయన స్థాపించిన (టీవీకే) పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయపథంలో దూసుకుపోతూ, దశాబ్దాలుగా తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేస్తున్న సంప్రదాయ ద్రవిడ పార్టీలకు గట్టి సవాల్ విసిరింది. తాజా ఓట్ల లెక్కింపులో టీవీకే స్పష్టమైన ఆధిక్యంతో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా ముందుకు సాగుతుండటం విశేషం. ఒక సినీ హీరో నుంచి ప్రజానాయకుడిగా రూపాంతరం చెందిన విజయ్, తన రాజకీయ ప్రవేశంతోనే రాష్ట్రంలో కొత్త సమీకరణాలకు తెరలేపారు. యువతలో మార్పు పట్ల ఉన్న ఆకాంక్ష, ప్రత్యామ్నాయ రాజకీయాలపై పెరిగిన నమ్మకం, విజయ్ వ్యక్తిగత ఇమేజ్ కలిసి ఈ ఫలితాలకు దోహదపడినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామం కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, దేశ రాజకీయాల్లోనూ కొత్త చర్చలకు దారితీస్తూ, భవిష్యత్ రాజకీయాలకు కొత్త మార్గదర్శకంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

— ప్రభాత గమనం, చెన్నై

- ద్రవిడ కోటలో 'దళపతి' ప్రభంజనం
- దశాబ్దాల రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిన టీవీకే విజయ్
- తమిళ వెట్రి కళగం గ్రాండ్ విక్టరీ
- 100కు పైగా స్థానాల్లో ఆధిక్యం.. చెన్నై వీధుల్లో అభిమానుల కోలాహలం
- స్క్రీన్‌పై నాయకుడు.. సీటుపై ముఖ్యమంత్రి
- సెన్సార్ చిక్కుల్లో ఉన్న 'జన నాయకుడు' సినిమా.. నిజ జీవితంలో పట్టం కట్టిన తమిళ ప్రజలు
- హంగ్ దిశగా తమిళనాడు
- హోరాహోరీ పోరులో కింగ్ మేకర్‌గా ఎదిగిన స్టార్ హీరో

# రీల్ టు రియల్

2

# 'జన నాయకుడు'గా విజయ్ దళపతి

# బెంగాల్ బీజేపీదే..

- 15 ఏళ్ల మమతా బెనర్జీ పాలనకు ముగింపు..
- తొలిసారి బీజేపీ సర్కార్
- టీఎంసీని ముంచిన అవినీతి ఆరోపణలు
- ఉపాధ్యాయ నియామక కుంభకోణం, సందేశ్ ఖాలీ ఘటనలే ఓటమికి ప్రధాన కారణం
- బీజేపీ వైపు మళ్లిన మహిళా ఓటర్లు
- ఆర్.జి.కర్ ఆసుపత్రి ఘటన ప్రభావం.. భద్రతకే మొగ్గు చూపిన మహిళా లోకం
- పౌరసత్వ హామీతో భారీ మెజారిటీ
- సీఏఏ (CAA) అమలు దిశగా అడుగులు.. మతువా సమాజం మద్దతుతో క్లీన్ స్వీప్
- సువేందు వ్యూహం - మోదీ మేజిక్
- క్షేత్రస్థాయిలో టీఎంసీని దెబ్బకొట్టిన విపక్ష నేత..



2

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ శకం ముగిసింది. అజేయ శక్తిగా భావించిన 'దీదీ' కోటను బద్దలు కొడుతూ కాషాయ దళం చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. పదిహేనేళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు స్వస్తి పలుకుతూ, అవినీతి వ్యతిరేక నినాదంతో కమలం పార్టీ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. టీఎంసీ నేతలపై వచ్చిన కుంభకోణాల ఆరోపణలు, సందేశ్‌ఖాలీ వంటి ఘటనలతో మహిళా ఓటు బ్యాంకులో వచ్చిన చీలిక బెంగాల్‌ను మార్పు దిశగా నడిపించాయి. బెంగాల్‌లో వీచిన మార్పు గాలికి మమతా బెనర్జీ సామ్రాజ్యం కుప్పకూలింది. సంక్షేమ పథకాల కంటే భద్రతకే ప్రాధాన్యం ఇచ్చిన మహిళలు, అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మధ్యతరగతి ఓటర్లు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు. సువేందు అధికారి క్షేత్రస్థాయి వ్యూహాలు, మోదీ మేజిక్ తోడవ్వడంతో పశ్చిమ బెంగాల్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది.

# కేరళం యూడీఎఫ్ కైవసం!

- ఎల్డీఎఫ్ కోటలో కాంగ్రెస్ కూటమి పాగా
- 100కు పైగా స్థానాల్లో ఆధిక్యం..
- పినరయి విజయన్ సర్కార్ కు చెక్
- తిరువనంతపురంలో మిన్నంటిన సంబరాలు..
- కేక్ కట్ చేసిన కేసీ వేణుగోపాల్

2



## అకాల వర్షాలపై
# అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రతి రైతుకు న్యాయం జరగాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్లతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్




వివరాలు 3వ పేజీలో..

## నకిలీ నోట్ల తయారీ ముఠా
# గుట్టు రట్టు

- నకిలీ నోట్ల తయారీతో పాటు '1:3' స్కీమ్ పేరుతో అమాయకులను మోసం చేసిన ముఠా అరెస్ట్
- వరంగల్ టాస్క్ ఫోర్స్ – నర్సంపేట పోలీసుల సంయుక్త ఆపరేషన్ విజయవంతం
- రూ.1.48 లక్షల నగదు, రూ.28 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం
- తెలంగాణ వ్యాప్తంగా ఇదే తరహా మోసాలు...
- ఇప్పటికే కేసులు నమోదు

04

# రీల్ టు రియల్

- జన నాయకుడిగా విజయ్ దళపతి ప్రభంజనం
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే గ్రాండ్ విక్టరీ
- సోషల్ మీడియాలో హీరో పేరు ట్రెండింగ్
- అభిమానుల సందడే సందడి!

**చెన్నై, మే 4 (ప్రభాత గమనం):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం (TVK) పార్టీ అనూహ్య విజయంతో దూసుకుపోతోంది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్న ద్రవిడ పార్టీలకు దీటుగా విజయ్ తన ప్రభావాన్ని చాటు కున్నారు. తాజా కౌంటింగ్ సరళి ప్రకారం.. మెజారిటీకి చేరువలో సీట్లను సాధిస్తూ టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది.

### రాజకీయాల్లో 'దళపతి' మార్క్

గతేడాది పార్టీని స్థాపించిన విజయ్, తన 69వ సినిమా 'జన నాయకుడు' షూటింగ్ పూర్తి చేసిన అనంతరం పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎన్నికల ప్రచారంలో ఆయనకు వచ్చిన జనాదరణ ఇప్పుడు ఓట్ల రూపంలో మారుతోంది. మొత్తం 234 స్థానాలకు గానూ, టీవీకే దాదాపు 105 కంటే ఎక్కువ స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యంలో ఉండటం విశేషం. దీనితో రాష్ట్రంలో 'హంగ్' ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటులో టీవీకే కీలక పాత్ర పోషించనుంది.

### సినిమా ఆగిపోయినా.. విజయం ఆగలేదు

విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయకుడు' అనేక సెన్సార్ చిక్కుల వల్ల విడుదల వాయిదా పడుతూ వస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సిన ఈ సినిమాను, రాజకీయ కారణాలతోనే అడ్డుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, థియేటర్లలో తమ హీరోను నాయకుడిగా చూడలేకపోయినా, నిజ జీవితంలో శాసనసభకు పంపడం పట్ల అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

### సోషల్ మీడియాలో ట్రెండింగ్

ఫలితాల వెల్లడితో సోషల్ మీడియా వేదికగా విజయ్ పేరు మారుమోగిపోతోంది. #ThalapathyVijay, #TVKVictory వంటి హాష్‌ట్యాగ్‌లు జాతీయ స్థాయిలో ట్రెండ్ అవుతున్నాయి. "స్క్రీన్‌పై జన నాయకుడిగా చూడాలనుకున్నాం.. కానీ ప్రజలు ఆయన్ని నిజమైన నాయకుడిని చేశారు" అంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

### విడుదలపై మేకర్స్ ఫోకస్

ఎన్నికల ఫలితాలతో విజయ్ పార్టీ అధికారానికి చేరువ కావడంతో, నిలిచిపోయిన 'జన నాయకుడు' సినిమా విడుదలకు మార్గం సుగమం అయ్యే అవకాశం ఉంది. ఈ చిత్ర నిర్మాతలు మరియు దర్శకుడు హెచ్. వినోద్ త్వరలోనే సెన్సార్ పనులను పూర్తి చేసి, కొత్త విడుదల తేదీని ప్రకటించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి, వెండితెరపై కోట్లాది మందిని అలరించిన విజయ్, ఇప్పుడు ప్రజానాయకుడిగా తమిళనాట సరికొత్త ప్రస్థానాన్ని మొదలుపెట్టారు.




# బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఘోర పరాజయం

- దీదీకి మరోసారి భారీ షాక్
- అప్పుడు నందిగ్రామ్- ఇప్పుడు భవానీపూర్
- వరుస ఎన్నికల్లో మమతను ఓడించిన సువేందు

**కలకత్తా, మే 4 (ప్రభాత గమనం)**



పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె, బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఓడారు. ఉత్కంఠగా సాగిన ఈ పోరులో సువేందు 15105 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో అధికారం కోల్పోయి షాక్లో ఉన్న టీఎంసీకి భారీ షాక్ తగిలినట్లైంది! ఈ ఎన్నికల్లో మమతకు 58812 ఓట్లు రాగా, సువేందుకు 73917 ఓట్లు వచ్చాయి. దీంతో బీజేపీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఈ కోలాహలం మధ్యలోనే సువేందు ఎన్నికల అధికారుల నుంచి తన గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. కాగా, 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ సువేందు అధికారి, మమతను ఓడించారు. ఆ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి పోటీలో ఉన్న మమతపై సువేందు సుమారు 19 వందల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇలా వరుసగా రెండు ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిని ఓడించిన సువేందు జాయింట్ కిల్లర్గా నిలిచారు.



# కేసముద్రంలో ఘనంగా గృహప్రవేశ వేడుక

- ముఖ్య అతిథిగా హాజరైన సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య

**కేసముద్రం, మే 04:(ప్రభాత గమనం)**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో కాయితోజు లక్ష్మి–సోమన్న దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం సోమవారం ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత, సామాజిక కార్యకర్త సమ్మి గౌడ్ తన సోదరుడు సాయి గౌడ్ తో కలిసి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. గృహప్రవేశం సందర్భంగా సమ్మి గౌడ్ ఇంటి యజమానులకు, వారి కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం బహుమతులు ఇవ్వడమే కాకుండా, బంధుమిత్రుల మధ్య ఆప్యాయతను పంచుకోవడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని చాటిచెప్పారు. ఆయన సేవా స్ఫూర్తిని, ఉదారతను చూసి స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.నూతన గృహంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో సమ్మి గౌడ్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. "శుభకార్యాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి ఆనందాన్ని పంచుకోవడం మన భారతీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఈ నూతన గృహంలో లక్ష్మి–సోమన్న దంపతులు సకల ఐశ్వర్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు."ఈ వేడుకలో గ్రామ పెద్దలు, బంధుమిత్రులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులను, గృహస్తులను ఆశీర్వదించారు. అతిథుల రాకతో, వేద మంత్రాల ఉచ్చారణతో గృహప్రవేశ వేడుక అంతా ఆధ్యాత్మికతతో, సందడితో కళకళలాడింది.



# కేరళ యూడీఎఫ్ కైవసం!

- ఎల్డీఎఫ్ కోటలో కాంగ్రెస్ కూటమి పాగా
- 100కు పైగా స్థానాల్లో ఆధిక్యం..
- పినరయి విజయన్ సర్కార్ కు చెక్
- తిరువనంతపురంలో మిన్నంటిన సంబరాలు..
- కేక్ కట్ చేసిన కేసీ వేణుగోపాల్

**తిరువనంతపురం, మే 4 (ప్రభాత గమనం):**

దక్షిణాది రాష్ట్రం కేరళలో ఐదేళ్లకోసారి అధికారం మారే సంప్రదాయం మళ్లీ పునరావృతమైంది. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ (LDF) సర్కార్‌కు షాక్ ఇస్తూ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (UDF) ఘనవిజయం దిశగా దూసుకుపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న ఫలితాల్లో యూడీఎఫ్ తన స్పష్టమైన ఆధిక్యాన్ని చాటుకుంది.

### ఏకపక్షంగా ఫలితాలు

మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను, యూడీఎఫ్ కూటమి ఏకంగా 100కు పైగా నియోజకవర్గాల్లో ముందంజలో ఉంది. గత ఎన్నికల్లో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించిన ఎల్డీఎఫ్, ఈసారి ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక వెనుకంజలో పడిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలకుండా తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ కూటమి విజయవంతమైంది.

### కాంగ్రెస్ శ్రేణుల కోలాహలం

ఫలితాల సరళి స్పష్టమవడంతో తిరువనంతపురంలోని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (KPCC) కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ముఖ్య నేతలతో కలిసి విజయోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్

**హైదరాబాద్, ప్రభాతగమనం :**

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా(డీజీపీగా) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోలీస్ శాఖలోని పలు కీలక విభాగాల్లో సేవలందించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే ట్రాన్స్ ఫర్ అయ్యారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో పనిచేశారు. ఇంతవరకు డీజీపీగా ఉన్న శివధర్ రెడ్డి పదవీకాలం ఆదివారంతో ముగియడంతో సీవీ ఆనంద్ ను ప్రభుత్వం నూతన పోలీస్ బాస్ గా నియమించింది.



# బెంగాల్ బీజేపీదే..

- 15 ఏళ్ల మమతా బెనర్జీ పాలనకు ముగింపు..
- తొలిసారి బీజేపీ సర్కార్
- టీఎంసీని ముంచిన అవినీతి ఆరోపణలు
- ఉపాధ్యాయ నియామక కుంభకోణం, సందేశ్ ఖాళీ ఘటనలే ఓటమికి ప్రధాన కారణం
- బీజేపీ వైపు మళ్లిన మహిళా ఓటర్లు
- ఆర్.జి.కర్ ఆసుపత్రి ఘటన ప్రభావం.. భద్రతకే మొగ్గు చూపిన మహిళా లోకం
- పౌరసత్వ హామీతో భారీ మెజారిటీ
- సీఏఏ (CAA) అమలు దిశగా అడుగులు.. మతువా సమాజం మద్దతుతో క్లీన్ స్వీప్
- సువేందు వ్యూహం - మోదీ మేజిక్
- క్షేత్రస్థాయిలో టీఎంసీని దెబ్బకొట్టిన విపక్ష నేత..

**కోల్‌కతా, మే 4( ప్రభాతగమనం ):**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. 'దీదీ' కోటగా పేరొందిన బంగాల్‌లో ఈసారి కమలం వికసించింది. 15 ఏళ్ల మమతా బెనర్జీ పాలనకు స్వస్తి పలుకుతూ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారు. టీఎంసీ వైఫల్యాలు, అవినీతి ఆరోపణలు, మరియు క్షేత్రస్థాయిలో బీజేపీ వ్యూహాలు ఈ చరిత్రాత్మక మార్పుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

### అవినీతి మచ్చ.. టీఎంసీకి చేటు

తృణమూల్ కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణం ఆ పార్టీ నేతలపై వచ్చిన అంతులేని అవినీతి ఆరోపణలే. ముఖ్యంగా ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం (SSC Scam) మరియు రేషన్ పంపిణీలో అక్రమాలు మధ్యతరగతి ఓటర్లలో తీవ్ర అసంతృప్తిని నింపాయి. ఈ అంశాన్ని బీజేపీ సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగింది.

### మహిళా ఓటు బ్యాంకులో చీలిక

ఒకప్పుడు మమతకు వెన్నెముకగా నిలిచిన మహిళలు ఈసారి దూరం కావడం విశేషం.సందేశ్‌ఖాలీ ఘటన మహిళలపై జరిగిన అకృత్యాలు టీఎంసీ ప్రతిష్ఠను దిగజార్చాయి. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై ప్రభుత్వం స్పందించిన తీరు మహిళల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. 'లక్ష్మీ భండార్' వంటి సంక్షేమ పథకాల కంటే భద్రతకే మహిళలు మొగ్గు చూపారు.

### హిందూ ఓటు బ్యాంకు ఏకీకరణ & సీఏఏ (CAA)

హిందూ ఓటు బ్యాంకును ఏకీకృతం చేయడంలో బీజేపీ సఫలమైంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మతువా సమాజం మరియు ఇతర శరణార్థులకు పౌరసత్వ సవరణ చట్టం (CAA) అమలుపై ఇచ్చిన హామీ బీజేపీకి భారీ మెజారిటీని కట్టబెట్టింది. నదియా, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో కాషాయ దళం క్లీన్ స్వీప్ చేసింది.

### సువేందు అధికారి వ్యూహం - మోదీ మేజిక్

విపక్ష నేత సువేందు అధికారి క్షేత్రస్థాయిలో టీఎంసీ లోపాలను ఎండగడుతూ పార్టీని బలోపేతం చేయగా, ప్రధాని నరేంద్ర మోదీ ప్రచార సభలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. "డబుల్ ఇంజిన్ సర్కార్" ఉంటేనే బంగాల్ అభివృద్ధి చెందుతుందన్న నినాదం యువతను ఆకర్షించింది.

### ముగిసిన ద్రవిడ - తృణమూల్ హవా

ఒకవైపు తమిళనాడులో విజయ్ తన పార్టీతో ప్రభంజనం సృష్టించగా, మరోవైపు బంగాల్‌లో బీజేపీ టీఎంసీని గద్దె దించింది. ప్రతిపక్ష ఓటు చీలిపోకుండా, కాంగ్రెస్ మరియు వామపక్షాల ఓట్లు కూడా బీజేపీ వైపు మళ్లడం కాషాయ దళానికి కలిసొచ్చింది. మొత్తం మీద 2026 ఎన్నికలు భారత రాజకీయాల్లో సరికొత్త మలుపుగా నిలిచిపోనున్నాయి.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతన్నకు కన్నీరు

- మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్
- గార్ల మండలంలో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను చూసి చలించిన బీఆర్ఎస్ నేత

**గార్ల, మే 4:(ప్రభాత గమనం) :**



గార్ల మండలంలో అకాల వర్షాలకు రైతులు పండించిన పంట తడిసి ముద్దవ్వడం ప్రకృతి వైపరీత్యం కాదు.. ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని బీఆర్ఎస్ మండల నేత, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం మండలంలోని పలు ధాన్యం రాశులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న జాప్యం అన్నదాతల పాలిట శాపంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "సకాలంలో కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంటే, నేడు వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయ్యే పరిస్థితి వచ్చేది కాదు. ఇది ప్రభుత్వ అలసత్వం వల్ల జరిగిన నేరం" అని రమేష్ దుయ్యబట్టారు.కళ్లముందే పండించిన పంట వర్షార్పణం అవుతుంటే రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారని, కానీ పాలకులు మాత్రం ఏమీ తెలియనట్లు కాలయాపన చేయడం దారుణమని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తూ రైతులను నట్టేట ముంచడం ఏ రకమైన పాలన అని ఆయన ప్రశ్నించారు.రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే, వర్షానికి తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం నిబంధనలు పక్కన పెట్టి వెంటనే కొనుగోలు చేయాలి.నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల చొప్పున తక్షణమే ఆర్థిక సాయం అందించాలి.ధాన్యం సేకరణలో జాప్యం చేసిన బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.రైతు కన్నీరు తుడవలేని ఈ ప్రభుత్వం అధికారంలో ఉండటానికి అనర్హమని శీలంశెట్టి రమేష్ ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్రమత్తు వదిలి యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కలెక్టర్లు కృషి చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్లతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్





మహబూబాబాద్ మే4(ప్రభాత గమనం):

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ నుండి పలువురు మంత్రులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ,పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకాటి శ్రీహరి,ఐటీ,పరిశ్రమలు & వాణిజ్యంశాఖల మంత్రి శ్రీధర్ బాబు, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ, వృద్ధుల సంక్షేమ, మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అట్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిచే పరిస్థితులు ఏర్పడుతున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వర్ష సూచనలు ఉన్నప్పుడల్లా వెంటనే రైతులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి వరకు వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రైతులను ముందుగానే హెచ్చరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా టార్పాలిన్లు, గిడ్డంగి సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిట్టచివరి రైతు వరకూ న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అన్ని జిల్లాల్లో ముందస్తు చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, ధాన్యం, మొక్కజొన్న సహా ప్రతి రైతు ఉత్పత్తిని కొనుగోలు చేసి చిట్టచివరి రైతుకు కూడా న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ మే నెల ధాన్యం కొనుగోలుకు అత్యంత కీలకమని, అధికారులందరూ సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం గా పూర్తి చేయాలని అన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లాల కలెక్టర్లు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత బాధ్యతతో, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో గత రెండు సీజన్లతో పోలిస్తే అధికంగా ధాన్యం ఉత్పత్తి నమోదైనందున, కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచాలని అన్నారు . కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత ఇంచార్జి మంత్రులకు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..ధాన్యం రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ముందస్తుగా చేయాలని ఆదేశించారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లతో సమన్వయం పెంచాలని అన్నారు. అవసరమైన గోదాములు లేదా మార్కెట్ యార్డ్ షెడ్యూల్లో ధాన్యం భద్రపరచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరి మరియు మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం చేరుకున్నదని, వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన రైతులకు వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- రూ.5 వేల జరిమానాతో జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు

మహబూబాబాద్ టౌన్, మే 04 (ప్రభాత గమనం):

మహబూబాబాద్ పట్టణంలో సంచలనం సృష్టించిన హత్య కేసులో జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిందితుడు సంపత్ శ్రీను (40)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి ఎండీ అబ్దుల్ రఫీ సోమవారం తీర్పు చెప్పారు. శిక్షతో పాటు రూ.5వేల జరిమానా కూడా విధించారు. ఈ ఘటన 2025లో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు వనగల్ల గుట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మేస్త్రీగా పనిచేసే సంపత్ శ్రీను పై బీఎన్ఎస్ సెక్షన్ 103 (హత్య) కింద క్రైమ్ నెం. 304/2025గా నమోదు చేసి, అనంతరం ఎస్‌సి నెం. 136/2025గా కోర్టులో విచారణకు తీసుకున్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక ప్రజా అభియోగాధికారి కొంపల్లి వెంకటయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసుల దర్యాప్తులో సేకరించిన శాస్త్రీయ సాక్ష్యాధారాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నిందితుడిపై నేరాన్ని రుజువు చేయడంలో కీలకంగా మారాయి. దీంతో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 235(2) ప్రకారం కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి తుది తీర్పు ఇచ్చింది. కేసు దర్యాప్తును ఎస్ఐ టి. ప్రశాంత్ బాబు, సీఐ పి. సర్వయ్య, ఇన్‌స్పెక్టర్ జి. మహేందర్ రెడ్డిలు వేగవంతంగా పూర్తి చేసి పక్కా సాక్ష్యాలను కోర్టుకు సమర్పించారు. డీఎస్పీ ఎన్. తిరుపతి పర్యవేక్షణలో విచారణ కొనసాగింది. కోర్టు లైజన్‌గా ఎన్. జీనత్ (ఎస్ఐ, డీసీఆర్‌బీ), డాక్యుమెంటేషన్ బాధ్యతలను బుక్యా రవీందర్ (పిసి-537, సీడీఓ) నిర్వహించారు. నిందితుడికి కఠిన శిక్ష పడటంపై జిల్లా పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో నేరాలను అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని, నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పకడ్బందీ దర్యాప్తు ఉంటే నేరస్తులు తప్పించుకోలేరని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని తెలిపారు.

# 'ఫార్మా' బాధితులకు అండగా ఉంటా..

- మీ భూముల్లోంచి ఒక్క గజం భూమి కూడా పోనివ్వను
- బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భరోసా

హైదరాబాద్ మే4(ప్రభాత గమనం):

ఫార్మా సిటీ ఏర్పాటు పేరుతో భూములు కోల్పోయే ప్రమాదంలో ఉన్న రైతులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. గత 50 రోజులకు పైగా 45 డిగ్రీల ఎండలో టెంట్లు వేసుకుని తమ హక్కుల కోసం పోరాడుతున్న బాధితుల వద్దకు ఆయన స్వయంగా వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. ఫార్మా సిటీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నాయకులు ఇప్పుడు మాట మార్చి రైతులపై బెదిరింపులకు దిగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## తీన్మార్ మల్లన్న రైతులకు ఇచ్చిన ప్రధాన హామీలు:

ఒక్క గజం భూమి కూడా పోనివ్వను: పేద రైతుల భూముల్లోంచి ఒక్క గజం కూడా పోకుండా అడ్డుకునే బాధ్యత తనదేనని, భూములు గుంజుకోవాలని చూసే నాయకుల మెడలు వంచుతానని మల్లన్న హామీ ఇచ్చారు. అవసరమైతే అడ్డం పడుకుంటానని, అసెంబ్లీలో సైతం కొట్లాడి ఈ పోరాటాన్ని ఏ స్థాయికైనా తీసుకెళ్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఉద్యమం హైదరాబాద్‌కు మార్చాలి:స్థానికంగా పల్లెల్లో టెంట్లు వేసుకుని కూర్చుంటే ప్రభుత్వం పట్టించుకోదని, ఈ సమస్య ప్రపంచానికి, రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఉద్యమాన్ని హైదరాబాద్‌కు తరలించాలని మల్లన్న పిలుపునిచ్చారు. కార్యాచరణ కోసం ప్రత్యేక కమిటీ:ఈ పోరాటాన్ని తాను స్వయంగా భుజానికెత్తుకుంటానని తెలిపిన ఆయన, బాధిత నాలుగు గ్రామాల నుంచి సుమారు 10-20 మంది ముఖ్యులు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తనను కలవాలని కోరారు. వారి కోసం తన ఇతర అపాయింట్‌మెంట్లు అన్నీ రద్దు చేసుకుంటానని, వారితో కలిసి పోరాటం కోసం ఒక 'యాక్షన్ ప్లాన్' (కార్యాచరణ) మరియు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తానని చెప్పారు.

## ప్రభుత్వంపై రైతుల ఆవేదన

ఈ సందర్భంగా రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటూ.. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి తమ భూముల వివరాలు తొలగించారని, రైతుబంధు నిలిపివేశారని వాపోయారు. ధరణి లాంటి ఆన్‌లైన్ రికార్డుల్లో భూమి లేకపోవడం వల్ల తాము పండించిన పంటను అమ్ముకోలేకపోతున్నామని, కనీసం యూరియా కూడా కొనుక్కోలేని దారుణమైన పరిస్థితుల్లో ఉన్నామని మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాలన్నింటిపై స్పందించిన మల్లన్న, రాజకీయ నాయకుల్లా తాను మాట తప్పే వ్యక్తిని కానని, బాధితులకు జరిగిన నష్టాన్ని ఆపుతానని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారి భూములు మరియు హక్కులను కాపాడుతామని తెలిపారు. భవిష్యత్ ఉద్యమ బాధ్యతను తాను తీసుకుంటున్నానని ప్రకటించారు.





# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య భరోసా
- బయ్యారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

బయ్యారం, మే 4:(ప్రభాత గమనం)

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. సోమవారం బయ్యారం మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మందకొడిగా సాగడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. గన్ని బ్యాగుల కొరత, కాంటాల నిర్వహణలో జాప్యం, మరియు లారీల రాకపై సదరు కాంట్రాక్టర్లతో ఫోన్లో మాట్లాడి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న తీరుపై సంబంధిత సీఈఓ (CEO)ను ఎమ్మెల్యే మందలించారు.కొనుగోలు కేంద్రాల వద్ద దళారులు తిష్టవేసి రైతులను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని కనకయ్య పేర్కొన్నారు. అక్రమ కొనుగోళ్లపై నిఘా ఉంచి, దళారీలపై దాడులు (Raid) చేయాలని అక్కడే ఉన్న సీఐ రవీందర్‌ను ఆదేశించారు.తక్షణమే రైతులకు అందుబాటులో ఉంచాలి.కాంటా అయిన వెంటనే లారీల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి.అధికారులు కేంద్రాల వద్దే ఉండి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంబాబు, బయ్యారం మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మరియు ఇతర స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్

మహబూబాబాద్ మే4(ప్రభాత గమనం):

ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన ఎం యాకమ్మ తనకు గ్రామంలో ఉన్న వ్యవసాయ పట్టా భూమి నుండి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో కొద్ది భాగం పోయిందని, అందుకుగాను నష్టపరిహారం ఇప్పించగలరని కోరారు.మహబూబాబాద్ పట్టణంలోని సిద్ధార్థ మెస్ యజమాని నాగేంద్రబాబు తాము ఎం.ఎల్.సి ఎన్నికల నేపథ్యంలో భోజనాలను, ముఖ్యమంత్రి వర్యుల పర్యటనకు భోజనాలు సప్లై చేసిన ఖర్చులు ఇప్పించాలని కోరారు.కురవి మండలం అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన కందయ్య తనకు ముగ్గురు కుమారులని తనకున్న భూమిని ముగ్గురు కుమారులకు పట్టా చేసి ఇచ్చానని, ఇప్పుడు తన యోగక్షేమాలు కుమారులు పట్టించుకోవడంలేదని తన ఆరోగ్యం సహకరించడం లేదని తనకు న్యాయం చేయాలని కోరారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.



# గార్లలో బీజేపీ శ్రేణుల సంబురాలు

- మూడు రాష్ట్రాల్లో కమలం ఘనవిజయం
- స్వీట్లు పంచి, పటాకులు పేల్చిన కార్యకర్తలు

గార్ల, మే 4 (ప్రభాత గమనం ):

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అద్భుత ప్రదర్శన కనబరిచిన నేపథ్యంలో, గార్ల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్క శివకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్ వద్ద భారీ ఎత్తున విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు.కార్యకర్తలు బాణసంచా కాల్చి, జై శ్రీరామ్, భారత్ మాతా కీ జై నినాదాలతో హోరెత్తించారు.బాటసారులకు, స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ విజయాలు కార్యకర్తల కష్టానికి ప్రతిఫలమని నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి రావుక విమల్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. మూడు రాష్ట్రాల ప్రజలు బీజేపీ నాయకత్వంపై నమ్మకంతో ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని కొనియాడారు. "ఈ విజయం ప్రతి కార్యకర్త శ్రమకు నిదర్శనం. దేశవ్యాప్తంగా వీస్తున్న బీజేపీ గాలి త్వరలోనే తెలంగాణను కూడా తాకుతుంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం," అని ధీమా వ్యక్తం చేశారు.ఈ వేడుకల్లో గార్ల 8వ వార్డ్ మెంబర్ గుగులోతు భారతి, దేవా, ప్రధాన కార్యదర్శి గోన సాయికృష్ణ, వెంగళ బుచ్చిబాబు, సోనియా వీర్యా నాయక్, వాసు, మచ్చ నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుండెపాక వెంకన్నకు 'దళితరత్న'

- రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానం

నెక్కొండ, మే 4 (ప్రభాత గమనం):

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మహనీయుల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దళితరత్న అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రముఖులను గుర్తించి వారికి దళితరత్న అవార్డులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో నెక్కొండ పట్టణానికి చెందిన గుండెపాక ప్రభాకర్ (టీపీసీసీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్, ఎస్సీ సెల్) దళితరత్న అవార్డుకు ఎంపికై సత్కారం అందుకున్నారు. దళితుల హక్కుల సాధనలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా గుండెపాక ప్రభాకర్ మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతి కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, దళితుల హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అవార్డు ప్రదానం చేసిన ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగుల శాఖ మంత్రి, ఉత్సవాల కమిటీ చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ మేతరి రోజా రాణి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ పత్తి కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోరక్షణ కమిటీతో సీఐ సమావేశం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ గో రక్షక కమిటీ సభ్యులతో మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ అంజలి సోమవారం సమావేశమయ్యారు. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖకు గోరక్షక కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఏవైనా చట్ట వ్యతిరేకమైన లేదా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇతర మతాలకు చెందిన వ్యక్తుల భావాలను గౌరవించాలని పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకుని శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై లు రామ్ చరణ్, షాకీర్, మహబూబాబాద్ పట్టణ గో రక్షక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# సరస్వతి పుష్కరాలపై ఎస్పీ సమీక్ష

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా కాలేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలపై జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నోడల్ అధికారితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్‌ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణ కోసం సుమారు 2500 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం సుమారు 250 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పార్కింగ్ స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది. వన్‌వే ట్రాఫిక్ సిస్టమ్ అమలు చేయడం ద్వారా రద్దీని తగ్గించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా భక్తులకు సులభంగా రాకపోకలు జరిగేలా రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాల కల్పన చేపడుతున్నామని, వారి భద్రత దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.అత్యవసర సేవలు, వైద్య సదుపాయాలు, లైటింగ్, శానిటేషన్ వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# పిడుగుపాటుకు పశువులు మృతి

- బాధిత రైతును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్
- తాళ్లపూసపల్లిలో రైతులకు అండగా నిలిచిన మాజీ శాసనసభ్యులు
- ధాన్యం కొనుగోలు సమస్యలపై అధికారులతో ఫోన్లో చర్చ

కేసముద్రం, మే,4, (ప్రభాత గమనం) :

మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి గ్రామంలో ఆదివారం సంభవించిన పిడుగుపాటు ఘటనలో రైతు బత్యేం సమ్మయ్యకు చెందిన మూడు పశువులు మృతి చెందడం పట్ల మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సోమవారం బాధిత రైతు కుటుంబాన్ని ఆయన స్వయంగా పరామర్శించి, తన వంతుగా తక్షణ సాయం కింద రూ. 5,000 నగదును అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆ రైతుకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.అనంతరం గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శంకర్ నాయక్ సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.కాంటాలు (తూకం) సకాలంలో కాకపోవడం, గన్ని బ్యాగుల (బస్తాలు) కొరత, లోడింగ్ కోసం లారీలు రాకపోవడంతో నిల్వలు పేరుకుపోవడం వంటి సమస్యలు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సమస్యలపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ, అక్కడి నుంచే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే తూకాలు వేయాలని, లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, గ్రామ సర్పంచ్ కందుకూరు ఉప్పలయ్య, ఉప సర్పంచ్ బండారు యాకన్న, దేవేంద్ర, మాజీ సర్పంచ్ పోతకం సుధాకర్, బండి శ్రీనివాస్, వాలేరు దశరథం, గొట్టిపర్తి వెంకన్న, వల్లాల కొమురయ్యతో పాటు ఆరు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- మెగా రైతు మేళాను రైతులు వినియోగించుకోవాలి
- వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్

మహబూబాబాద్ మే4(ప్రభాత గమనం):

సోమవారం ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, లతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, కురవి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కురవి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆదివారంపడ్డ వర్షానికి జరిగిన నష్టాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని రైతులను అన్ని రకాల ఆదుకుంటామని విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, అన్నారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్నటువంటి ధాన్యాన్ని వెంటనే నిబంధన ప్రకారం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్స్, అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, రానున్న రోజుల్లో వర్షాలు పడే సూచన ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సెంటర్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో వరంగల్ జిల్లా సహకార బ్యాంక్ లిమిటెడ్ నూతన బ్రాంచ్ ని ప్రారంభించారు రైతులకు వేగవంతమైన మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డోర్నకల్ మండలం చిలుక్కోడ రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు వారోత్సవాలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈరోజు నుండి మే 9 వరకు వారం రోజులు రైతు వారోత్సవాలు జరుగుతాయని అందులో భాగంగానే రైతులకు సేంద్రియ ఎరువులు, నేచురల్ వ్యవసాయం వైపు ముగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్లు, పామ్ ఆయిల్ తదితర అంతర్ పంటల పై రైతులకు అవగాహన కల్పించి అవి వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మే 5, 6,7 మూడు రోజులు మెగా రైతు నేల నిర్వహించడం జరుగుతుందని, అందులో 150 స్టాల్స్ ను ఏర్పాటు చేసి రైతుల సౌకర్యార్థం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆ మూడు రోజులు జిల్లా నుండి ప్రతిరోజు ఉదయం 6 నుండి 7 మధ్యలో ( 13) బస్సుల ద్వారా రైతులను తరలించడం జరుగుతుందని కావున జిల్లాలోని రైతులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నానో యూరియా, వాడకం, పామ్ ఆయిల్, డ్రోన్ టెక్నాలజీ, తదితర స్టాల్స్ ను పరిశీలించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారిని సరిత, శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మక్కల రైతుల 'రాస్తారోకో'..

- తాళ్లపూసపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్తత
- బస్తాల్లేక, లారీలు రాక రైతుల అవస్థలు
- తెలంగాణ రైతు సంఘం (ఏఐకెఎస్) ఆగ్రహం

కేసముద్రం, మే 04 (ప్రభాత గమనం ):

అన్నదాత అరిగోస పడుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద 15 రోజులుగా కంటిమీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నా.. సర్కారు యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదని రైతులు మండిపడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద నెలకొన్న సమస్యలను నిరసిస్తూ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం కేసముద్రం-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై 'రాస్తారోకో' నిర్వహించారు.గత 20 రోజుల క్రితమే రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. అయితే, ప్రభుత్వం కేవలం 10 వేల బస్తాలను మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందని రైతు సంఘం నాయకులు ఆరోపించారు.ప్రభుత్వం ఇచ్చిన బస్తాలు అయిపోవడంతో, మిగిలిన రైతులు తమ సొంత ఖర్చుతో బస్తాలు తెచ్చుకుంటామన్నా.. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాలేదనే సాకుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం కురిసిన గాలివాన, అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయని, తడిచిన పంటను చూసి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.రైతుల సమస్యలను తెలుసుకున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మార్తినేని పాపారావు, మండల అధ్యక్షుడు నీరూటి జలంధర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు.

"కొనుగోలు కేంద్రంలో ఇంకా 30 వేల బస్తాల మొక్కజొన్నలు తరలింపుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవి కాక గ్రామంలోని కళ్ళాల్లో భారీగా నిల్వలు ఉన్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి లారీలను పంపాలి, గడువులోగా కాంటాలు పూర్తి చేయాలన్నారు."మొక్కజొన్నతో పాటు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, రేపు జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు మాదా శ్రీనివాస్, కాలేరు రామ్మూర్తి, మేకల మురళి, బానోత్ కిషన్, కాలేరు వెంకటమ్మ, భాదవత్ రమేష్, రాములు నాయక్, మోక్ష వెంకటేష్, సారయ్య, వెంకన్న, నర్సయ్య, పీరియా తదితర రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# నకిలీ నోట్ల గుట్టు రట్టు

- ఎనిమిది నిందితుల అరెస్టు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

నకిలీ నోట్లను తయారుచేసి (ప్రింట్ తీసి) మార్కెట్లో చలామణి చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మరియు తెలంగాణలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3లో తయారు చేసి ఇస్తామని చెప్పి కోరిన వారికి 500 నోట్ల పరిమాణంలో నల్ల కాగితాలను ఇస్తూ మోసగిస్తున్న ఐదుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్ ఫోర్స్ మరియు నర్సంపేట పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల నుండి నకిలీ నోట్లను, అసలు రూ.1,48,000 , సుమారు 28 లక్షల విలువ గల ల్యాప్ టాప్ లు, ప్రింటర్స్, 13 సెల్‌ఫోన్లు, రెండు కార్లులను స్వాధీన పరుచుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులు నర్సంపేటకు చెందిన శాగంటి కిరణ్, నీరటి శివ, నీరటి రంజిత్, గుడికందుల రవి, ములుగు ఘనపురానికి చెందిన పోరిక రాజ్‌కుమార్ ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన తనమాల రాజశేఖర్, భువనగిరి జిల్లా తాతానగర్ కు చెందిన ముదురుకోల యాకాంబ్రం, కొత్తగూడెం జిల్లా కారకగూడెంకు చెందిన చేను సాయికిరణ్ గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ.. నర్సంపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగ వారు అసలు 100 రూపాయలు నోట్లను ల్యాప్ టాప్ మరియు ప్రింటర్ ద్వారా కలర్ ప్రింట్ తీసి మార్కెట్లో అసలు నోట్లుగా చలామణి చేస్తున్నారని మరియు మిగిలిన ఐదుగురు వ్యక్తులను విచారించగ వారు తెలంగాణ రాష్ట్రంలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3లో తయారు చేసి ఇస్తామని చెప్పి వారు బాధితులను నమ్మించడానికి, అసలైన 500 రూపాయల కరెన్సీ నోట్లను అయోడిన్ టింక్చర్ ద్రావణంలో ముంచడం ద్వారా వాటిని నల్లగా మార్చి, ఆపై 'హైపో' (సోడియం థయోసల్ఫేట్) ద్రావణంలో ముంచగ, రసాయన చర్య ఫలితంగా వాటి అసలు రూపాన్ని తిరిగి వచ్చేలా చేసి, వారి ప్రణాళిక ప్రకారం, వారు నల్లటి రంగు కాగితాలను కట్టలుగా కట్టి, కోరినవారికి ఇచ్చి, వారు పైన చెప్పిన విదంగా చేసినట్లయితే, అవి అసలు నోట్లలాగా మారుతాయని నమ్మించి, వారి వద్ద నుండి అసలు నోట్లు తీసుకొని పరారు అవుతారు. ఇదే విధంగా వారు గతంలో ఘనపూర్ (ము లుగు), మోండా మార్కెట్ (సికింద్రాబాద్), వెంసూర్, కొత్తగూడెం, కె యూ సి మరియు సుబేదారీ పరిధిలో మోసం చేయగా వారిపై కేసులు నమోదయ్యాయి. ఈ మద్యకాలంలో వారు తెలంగాణలో చత్రినాక (హైదరాబాద్) మరియు నర్సంపేటలలో మోసం చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ బాబులాల్, నర్సంపేట ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, ఏఏవో సల్మాన్ పాషా, టాస్క్ ఫోర్స్, నర్సంపేట సిబ్బందిని సీపీ అభినందించారు.

# రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్
- ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాల సందర్శన

కేసముద్రం, మే 04 (ప్రభాత గమనం) :

"ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు కన్నీరు పెట్టిన రాజ్యం ఎన్నటికీ బాగుపడదు" అని మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంలోని గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాన్ని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తీరుపై శంకర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయాలకు తాళాలు వేసి, రైతులను బయట అమ్ముకోమని అధికారులు చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. "ప్రభుత్వ మార్కెట్లు మూసేస్తే రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలి?" అని ఆయన నిలదీశారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ట్రాక్టర్ వరి ధాన్యానికి ఏకంగా 30 కేజీల తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే బస్తాలను ఇప్పుడు రైతుల చేతే కొనిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట విలువలో 1% కట్ చేసుకుని, డబ్బుల కోసం 10 రోజులు వేచి చూసేలా చేస్తున్నారని చెప్పారు. పాలకవర్గం, అధికారులు ఈ దోపిడీని చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని ఆయన అన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేసముద్రం రైతుల పంటను త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను తీర్చకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రావుల రవిచంద్రా రెడ్డి, మర్రి రంగారావు, మండల అధ్యక్షులు మహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు వీరు నాయక్, కౌన్సిలర్లు వినయ్ రెడ్డి, దూదేపాక కృష్ణ, సర్పంచులు ఈసం లక్ష్మీనారాయణ, ఎదరబోయిన సూరయ్య, బోడ వీరన్న, ఏర్పుల కుమారస్వామి, కందునూరి మహేష్, అంకుష్, తోట శ్రీను, హరినాయక్, రవీందర్ రెడ్డి,హుస్సేన్ నాయక్, నాగుల్ మీరా పాషా, బానోత్ వెంకన్న, గణేష్ రైతులు, మహిళలు పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374